స్కెచ్

# "చెప్పు తినెడి కుక్క—"

"శశికాంత్"

"చెప్పు తినెడి కుక్క చెరకు తీపెరుగునా విశ్వదాభిరామ వినురవేమ!" చిన్నతమ్ముడికి పద్యం చెపుతున్నా వేమనశతకము చూసి.

హాల్లోనుంచి 'టైగర్' "భౌభౌ" మంటూ అరుస్తూ ప్రవేశించింది. ఎవరైనా యింటికివస్తే అరుస్తూ బయటకు పరుగెత్తేది. కాని, యిప్పుడేమో సరాసరి లోనికి వచ్చేసింది. ఆశ్చర్యంతో దాని కళ్ళలోకి చూశా! ధుమధుమ లాడుతూ నిప్పులు కక్కుతోంది 'టైగర్.' తల అడ్డంగా తెగ విసిరేస్తోంది.

"ఏం, కోపం వచ్చిందేం, శునక మహారాజు గారికి!" అని ప్రశ్నించాను.

"రాదుమరీ! బుద్ధిలేకపోతే సరి!"

"ఎవరికి?" అన్నాను ఆశ్చర్యంతో.

"రాసిన వాడికి, పసివాని బుర్రలో నాటే వాడికి!" అని గదిమింది.

'ఓహో! అందుకా ఆగ్రహం."

"లేకపోతే మరేమిటి? చెప్పుతినెడి కుక్కకు చెరకు తీపి తెలియదట. తీపి తెలియందే బిస్కట్లు, బెల్లపు ముక్కలు యెలా మెక్కుతున్నాం?" నన్ను క్రాస్ చేసింది.

నిజమే ఆ రోజుల్లో—అంటే వేమనగారి కాలములో— బిస్కట్లు దొరక్కపోవచ్చు. కాని, మణుగులేసి బెల్లంతిన్న కుక్కలెన్నో వున్నాయ్. బెల్లంమాదిరే చెరకు తీపిగా వుంటుంది. పైగా చెరకునుంచేగా బెల్లం తయారుచేసేది. మరి ఆ కవిగారు చెరకుతీపెరుగు అని సెలవిచ్చారేమిటి?

"అయితే మరి, యిప్పుడేంచెయ్యమంటావ్?" టైగర్ని ప్రశ్నించాను.

"వచ్చేతరంవాళ్ళ బుర్రల్లోకి కూడా యీ పిచ్చి భావం యెక్కక ముందే దాన్ని మార్చెయ్యండి."

"ఏమని మార్చమంటావ్?"

"—చెరకు తినెడి కుక్క చెప్పు తీపెరుగు' అని." అంది. నాకు నవ్వాగక నవ్వేశాను.

"ఎందుకు నవ్వుతావ్?" కొరకొర చూస్తూ ప్రశ్నించింది.

"నవ్వాగందే! సరే, చెరకుతీపి తెలుసునను కొందాం. మరి చెప్పులు తినటం మానవుగా? చెప్పు తీపెరుగునంటావేం?"

"ఎందుకు తింటాం? తినం. చచ్చినా తినం. మీరు నన్ను చిన్నప్పటినుంచి పెంచుతున్నారుగా. ఎప్పుడైనా చెప్పుకొరకగా చూశారూ?"

'లేదు' అన్నట్లు తల వూపాను.

"మరి యింకేం. ఒకవేళ కడుపుకాలే కుక్క చెప్పులు తింటే దోషమేమిటి? ఎంగిలాకులు తినటంలేదా బీదవాళ్ళు? మీ అమ్మమ్మ నీ కెప్పుడూ చెప్పలేదా, 'ధాతనామ సంవత్సర కరువులో నల్లరేగటి బంకమట్టిని పెరుగుతో కలుపుకొని తిన్నారని.' అంతమాత్రంచేత 'మట్టి తినే మనిషికి చెరకు తీపెరుక' అనటం ధర్మమా?" టైగర్ లెక్చర్ పూర్తిచేసి, నా అంగీకారంకోసం నా కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూంది.

"రైట్, నువ్వే గెలిచావ్ టైగర్. ఇకవెళ్ళు" అని బుజ్జగించాను.

కోపమంతా తగ్గిపోయింది కాని అక్కడనుంచి కదల్లేదు.

"ఇంకాయేమిటి సందేహం?" అడిగాను.

" 'కనకపు సింహాసనమున' అన్న పద్యంలో 'వెనుకటి గుణమేల మాను' అన్నాడు సుమతికి నీతులుచెప్పే కవి. ఆ చిన్ని సుమతి మతిలో విషం పోస్తున్నాడు. వెనుకటి గుణం కనకపు సింహాసనాలెక్కే మానవులే మరచిపోతోంది. మా వెనుకటి గుణం——అంటే చెప్పులు తినటం, పెంటతినటం—— కడుపునిండా వుంటే మానేస్తాం మేము. ఇంకా మీ మానవులకే కనకపు సింహాసనము యెక్కాక

వెనుకటి గుణాలు, పెంటతినే బుద్ధులొస్తున్నాయ్. దాన్ని మార్చేసెయ్యండి."

"ఇది యేవిధంగా...?"

"'శునకము' బదులు 'మనిషిని' అని చేర్చండి. ప్రాస, గణాలు కూడా కుదురుతాయ్."

"మరి 'యతి' సంగతో...?"

"యతికూడా నేనే చెప్తే నీ 'మతి' ఎందుకు?"

"అదికూడా చెప్పూ." చెప్పలేదనే నా నమ్మకంతో అడిగేశాను.

కొంచెంసేపు యోచన చేసి "'ఘనలగ్నమునన్' అని ప్రాసయతి పారేయండి. నిషేధాల్లాంటి విశేషాలేమైనా వుంటే 'మహాలగ్నమునన్' అని వాడండి" అంది.

"అబ్బో! కవిత్వం కూడా చెపుతున్నావే!"

"చెప్పానుగా, మంచిబుద్ధి నేర్పితే మేమూ నేర్చుకొంటామని. మీరేమో తెలిసినవి మరచిపోయి మేము మానే బుద్ధుల్ని నేర్చుకొంటున్నారు" ధీమాగా విశదపరచింది.

"నిజం చెప్పావు" అని వెన్నుపై నిమిరాను. తోక వూపుతూ గేటు వైపు నడిచింది, విజయగర్వంతో అప్పుడప్పుడూ వెనక్కు తిరిగి చూస్తూ.

మాంసం తినే వాళ్లెవరైనా "పులుసు కూరలు తినే బ్రాహ్మణుల కేంతెలుసు మాంసం రుచి" అంటే వాళ్ళంతా రొమ్ము విరుచుకు రావటం మాట అటుంచి—అది మనుజుల సహజ తరహా అనిపించుకోదు. కుక్కలు యెదురు తిరగవు కాబట్టి అలుసుకొద్దీ అనేసి వుంటాడు వేమనగారు.

ఒకవేళ, 'కారం' అంటే యిష్టపడే వాళ్ళనుద్దేశించి "తీపిలో రుచేమి తెలుసు" అనటం కూడా అసమంజసంగానే వుంటుంది.

బెండకాయ కూడ పండకముందే తినేవాళ్లు కొందరున్నారు. పండాక కూడా ఒక్క ముక్క నోట్లో వేసికొని, తిన్నదంతా కక్కేవాళ్లు లెక్కలేనంతమంది. అలాగే 'జున్ను' విషయంలోనూ, అనేక విషయాల్లోనూ.

అయితే, 'కారం' అంటే యిష్టపడేవాళ్లు కూడా బెల్లం తీపి గ్రహించగలరు. కాని ఆ రుచి వాళ్ళకు గిట్టకపోవచ్చు. అంటే అది ఒక్కొక్కళ్ల యిష్టంపై ఆధారపడి వుంటుందన్నమాటేగా మరి. ఆ కవిగారేమో 'చెరుకు తీపే మెరుగు' అని అడిగాడు అభిరాముణ్ణి. ఆయనకూడా "అవునులే, యే మెరుగు" అన్నట్లు తలూపేశాడు. కాని, కుక్కకు చెరకు తీపి తెలియటం పొరబాటేగా. కుక్కకూడా చక్కగా గ్రహించగలదు. అయితేకొన్ని కుక్కలకు ఆ రుచి అంతగా కమ్మగా లేకపోవచ్చు.

"బెల్లం యెలావుంటూంది?" అని యెవరేనా అడిగితే "తియ్యగా వుంటుంది" అనేస్తాం. గులాబ్జామ్ బాగావుంటే 'కమ్మగా' వుంది అనేస్తాం, కాని తియ్యగా వుందనం. అలాగే కారంబూంది విషయంలోనూ, కారంగావుంది అనేస్తే—కారం యెక్కువగా వుందని. అదే బాగుంటే "ఓహ్! యెంత కమ్మగావుంది" అని పొగడటంతోపాటు లెక్కలేనంత మెక్కేస్తాం. అంటే కమ్మదనం ఒక్క తీపిమీదే ఆధారపడి వుండదనేగా.

కాబట్టి, మనలోకూడా యెవరిరుచి వాళ్ళకు వుంది. అలాగే కుక్కకు (కొన్నింటికే అయివుంటుంది.) చెప్పు రుచి కమ్మగా వుండవచ్చు, చెరకు తీపి సరిపడకపోవచ్చు. అందుకని "చెరకు తీపే మెరుగు" అని చెప్పాలినే కుక్కను దెప్పితే, కుక్కలు మాత్రం యెలా సహిస్తాయ్, విజ్ఞానంలో వెల్లివిరిసిన యీ యుగంలో వుంటూకూడా.

పందికి బురదంటే సరదా. అవును, దానియిష్టం దానిది, అందుకని 'బురదలో పొర్లే పంది' అనటం మన రుచుల్ని—అభిరుచుల్ని మనం మరచిపోవటమో, లేదా, మన రుచుల్ని యెదుటివాళ్ళమీద రుద్దబోవడమో అవుతుంది.

